క్లుప్తంగా

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ లాలం రమేష్, నాయకులు

వెలుగోడు: బోయరేవుల గ్రామంలో మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో తీవ్ర మంచినీటి ఎద్దడి ఉండేదని, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాలతో ఎంపీపీ నిధులతో ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేయించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేశామన్నారు. మంగళవారం గ్రామంలో పైప్‌లైన్ పనులను మాజీ సర్పంచ్ ముంతల విజయభాస్కర్‌రెడ్డి, రమణలతో కలసి పరిశీలించారు.

మండల అభివృద్ధికి కృషి



ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ

వెలుగోడు: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని నూతన ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ అన్నారు. ఇటీవల ఎంపీడీఓగా నియమితులైన శివప్రసాద్‌వర్మను మంగళవారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయన వైఎస్సార్ జిల్లా ఏ.కోడురులో డ్వామా ఏపీడీగా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ



కబడ్డీ క్రీడాకారుడికి ప్రశంసాపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం కృష్ణమూర్తి

పాములపాడు: రాష్ట్ర స్థాయి కబడ్డీ అసోషియేషన్ సబ్‌జూనియర్ పోటీలలో వేంపెంట జెడ్పీహెచ్ స్కూలు విద్యార్థి సాగర్ సత్తా చాటాడని హెచ్‌ఎం కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో కబడ్డీ పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థి సాగర్‌ను వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

నందికొట్కూరు: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, బసిరెడ్డి డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలోని అల్వాల ఫంక్షన్ హాల్‌లో కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో యువత సాంస్కృతిక కార్యక్రమాలతో అదరగొట్టారు. చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు మానవత విలువలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టరు రమేష్‌రెడ్డి, చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జాన్ ఏలీషా తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల మార్పు తగదు

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసే లోకల్ విద్యార్థులను లక్ష్మాపురం సెంటర్‌కు మార్చడం తగదని, యథాతథంగా ఇక్కడే పరీక్షలు రాసేలా అనుమతించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న డిమాండ్ చేశారు. మంగళవారం విద్యాశాఖ కార్యాలయంలోని ఎంఈఓ 2 మురళీమోహన్‌రెడ్డికి, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

ప్రత్యేక బస్సులను ఉపయోగించుకోండి

ఆత్మకూరు: శ్రీశైలం క్షేత్రానికి మహాశివరాత్రి సందర్భంగా ఆర్టీసీ నడుపుతున్న ప్రత్యేక బస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఎం మహేంద్రుడు కోరారు. ఆత్మకూరు డిపో నుంచి శ్రీశైలానికి 45బస్సులు, రుద్రకోడూరుకు 10, సంగమేశ్వరం, కొలనుభారతికి 10బస్సుల చొప్పున నడుపుతామన్నారు. అన్ని బస్సుల్లో సాధారణచార్జీలు వసూలు చేస్తామని చెప్పారు.

యువకులకు జైలుశిక్ష

మహానంది: మద్యం సేవించి ప్రజల ప్రాణాలకు హాని కలిగించే విధంగా కారును డ్రైవ్ చేయడంతో పాటు కారును రోడ్డుపై ఆపి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఇద్దరికి న్యాయమూర్తి రాంభూపాల్‌రెడ్డి ఇరవై రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. నంద్యాలకు చెందిన గురుప్రసాద్, శ్రవణ్‌లు ఈ నెల 1న తిమ్మాపురంలోని బస్టాండులో మద్యం మత్తులో బీభత్సం సృష్టించారన్నారు. దీంతో గ్రామానికి చెందిన మద్దూరు సుధాకర్, షేక్ మూబున్నిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. న్యాయమూర్తి వారికి జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 200 జరిమానా విధించారన్నారు. వీరితోపాటు బుక్కాపురం గ్రామానికి చెందిన శివప్రసాద్‌కు రూ. 5వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.







ఉత్సవం ముందు కళాకారుల ప్రదర్శనలు



గంగాధర మండపం వద్ద స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు



పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం



ఇరుముడి సమర్పిస్తున్న శివమాల ధరించిన భక్తులు



కళాకారుల నృత్యం ప్రదర్శన



రావణవాహనసేవలో కళాకారుల నృత్యాలు



పూలతో అలంకరించిన ధ్వజస్తంభం

ఓం.. శివోహం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటున్నారు. భక్తుల ఓంకార నాదంతో శ్రీగిరి క్షేత్రం ప్రతిధ్వనిస్తుంది. శివమాల ధరించిన భక్తులు ఇరుముడి సమర్పించేందుకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఉత్సవాల్లో భాగంగా స్వామిఅమ్మవార్లు రావణవాహన సేవలో భక్తులకు దర్శనమివ్వగా.. ఉత్సవంలో కళాకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



శ్రీశైలంలో తాత్కాలిక 30పడకల వైద్యశాలలో చికిత్స పొందుతున్న భక్తుడు



భక్తులకు చికిత్సలు అందిస్తున్న వైద్యులు



పాతాళగంగలో జపం చేస్తున్న భక్తుడు





నల్లమల అటవీ ప్రాంతంలో పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు గౌరవం

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- మహానంది మండలంలో ప్రభుత్వ భవనాల ప్రారంభం
- లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



మహానందిలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే శిల్పా, భువనేశ్వరరెడ్డి

మహానంది: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదవారు లక్ష అధికారులు అయ్యారని, పేదలకు గౌరవాన్ని తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మహానంది మండలం మసీదుపురం, సీతారామపురం, గోపవరం, బసవాపురం, మహానంది, బుక్కాపురం, అబ్బీపురం, తిమ్మాపురం గ్రామాల్లో రూ.5కోట్లతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రైతు సహకార సేవా కేంద్రం గోడౌన్లు, నూతన వాటర్ ట్యాంకులను మంగళవారం ప్రారంభించారు. అనంతరం మహానందిలో సాయంత్రం ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. అలాగే బండిఆత్మకూరు మండలం పరమటూరులో రూ. 75లక్షలతో నిర్మించిన కేంద్ర సహకార వ్యవసాయ గోడౌన్‌ను మంగళవారం ప్రారంభించారు. పరమటూరు సీఈఓ గడిగరేవుల గోపాల్, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. మహానందిలో నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడం పట్ల పేదలకు సర్వహక్కులు లభిస్తాయన్నారు. ఒకసారి కేటాయించిన స్థలాలను తొలగించడం ఎవరి సాధ్యం కాదన్నారు. ఇది ప్రతి పేద అక్కచెల్లెమ్మలకు జగనన్న బహుమతి అని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతూ ప్రతి ఒక్కరూ సమాజంలో గౌరవంగా బతుకుతున్నారని.. అలాంటప్పుడు మనకు చంద్రబాబు నాయుడు లాంటి టక్కరి దొంగలు అవసరమా అంటూ ప్రశ్నించారు. ఐదేళ్లపాటు ముఖం చూపని నేతలు ఎన్నికల సమీపిస్తుండటంతో కల్లబొల్లి మాటలు చెబుతూ మోసం చేసేందుకు ఎన్నికల దొంగలు వస్తారు జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

విభేదాలు వీడండి ఎన్నికలకు సిద్ధం కావాలి

మహానంది మండలంలో వైఎస్సార్‌సీపీ ఎంతో పటిష్ఠంగా ఉందని, నాయకుల మధ్య చిన్న చిన్న విభేదాలు ఉంటే వాటిని పక్కన పెట్టి ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సిద్ధం అవ్వాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మహానందిలోని శాలివాహన కుమ్మరి అన్న సత్రం కళా మండపంలో సాయంత్రం మండల పరిధిలోని పోలింగ్ బూత్ కమిటీ కన్వీనర్లు, కోర్ కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లలో సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన మంచిని, అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బూత్ కమిటీ కన్వీనర్లపై ఉందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున్ రెడ్డి, సర్పంచుల కందుల వరలక్ష్మమ్మ, సుదర్శనం, గాజులపల్లె సీనియర్ నేత కొండా మధుసూదన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ పగడాల నాగరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే శిల్పా అన్నారు. బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర, ఆంజనేయస్వామి ఆలయాల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్నారు. అలాగే ఏపీ రాష్ట్ర మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరు ఎల్లాల బాబు తండ్రి సంజీవరాయుడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాజులపల్లెలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. గోపవరం గ్రామానికి చెందిన సంతోష్ కంటి చూపును కోల్పోవడంతో రూ. 10వేలు ఆర్థికసహాయం అందించారు. ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు లింగాల సుబ్బయ్య, బూరుగయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వీబీఆర్ నుంచి మామిడి తోటలకు నీటి సరఫరా

వెలుగోడు: మండలంలో దాదాపు 300 ఎకరాల మామిడి తోటలకు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వన్ ఎల్ తూము నుంచి లిఫ్ట్ ద్వారా మంగళవారం ఎమ్మెల్యే శిల్పా నీటిని విడుదల చేశారు. వీబీఆర్ నుంచి నీటి విడుదల నిలిచిపోవడంతో పట్టణ సమీపంలోని గట్టు తాండ పరిసరాల్లో ఉన్న మామిడి తోటలు ఎండుముఖం పట్టాయి. ఈ విషయాన్ని రైతులు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. తన సొంత నిధులతో మూడు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి వీబీఆర్ పరిధిలోని వన్ ఎల్ తూము నుంచి లిఫ్ట్ చేయించి తోటలకు నీటిని అందించి రైతుల కన్నీటిని తుడిచారు. దీంతో రైతులు ఎమ్మెల్యే శిల్పాకు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు తెలుగు రమణ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల జగనన్నతో సాకారం

నందికొట్కూరు: పేదల సొంతింటి కల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాకారమైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో 9 నుంచి 14వ వార్డులకు చెందిన లబ్ధిదారులు 767 మందికి ఇళ్ల స్థలాల ఉచిత రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ రంగురంగుల మేనిఫెస్టోతో మళ్లీ చంద్రబాబు నాయుడు వస్తున్నారన్నారు. గత పాలనలో చంద్రబాబు పేదల కష్టాలను గాలికి వదిలేశారని గుర్తు చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుడితే ఆయన కోర్టు వెళ్లారన్నారు. అద్దె ఇళ్లలో అవస్థలు పడుతున్న నిరుపేదల చేతుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. లక్షల విలువ చేసే ఆస్తిని ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు చాంద్‌బాషా, రవూఫ్, కృష్ణ, నాయబ్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, గఫార్, నాయకులు ఉస్మాన్‌బేగ్, అబుబక్కర్, సులోచన, జబ్బార్, ఆర్ట్ శ్రీను, రవీంద్రారెడ్డి, రమేష్, రజినీకుమార్‌రెడ్డి, శాలిబాషా తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న డాక్టర్ దారా సుధీర్, చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

అక్కాచెల్లెమ్మల చేతిలో రూ.లక్షల ఆస్తి

కొత్తపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కాచెల్లెమ్మలకు రూ.లక్షల విలువచేసే ఆస్తిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారని జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత అన్నారు. మంగళవారం మండలంలోని దుద్యాల గ్రామంలో జగనన్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, నాయకులు రమేష్‌బాబు, రహంతుల్లా, వార్డు మెంబర్లు అక్రమ్, బ్రహ్మయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

పాములపాడు: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ అన్నారు. మంగళవారం మండలంలోని జూటూరు, మజరా కోల్స్ ఆనందాపురం గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. ఇతర పార్టీల వారి ప్రలోభాలకు లోనుకావద్దని, వైఎస్సార్‌సీపీ తప్ప ఇతర పార్టీ ల వైపు చూడొద్దన్నారు. మంచి మనసున్న జగన్నను గెలిపించుకునేందుకు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. జూటూరులో అగ్నిప్రమాద బాధితుడు జనార్దన్ గౌడ్‌కు రూ.10 ఆర్థిక సాయం అందజేశారు. కోల్స్ ఆనందాపురం గ్రామంలో చర్చి, బ్రిడ్జి, రహదారి నిర్మాణాలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచు విజయసింహారెడ్డి, మండల కార్యదర్శి మధుసూదన్‌రావు, యువజన విభాగం మండల అధ్యక్షుడు చరణ్, సొసైటీ చైర్మన్ గడ్డం క్రిష్టారెడ్డి, సర్పంచులు వరప్రసాద్, నారాయణ, రామస్వామి, ఎంపీటీసీ సురేష్, ఉప సర్పంచు సలాం, నాయకులు పాల్గొన్నారు.



జనార్దన్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దారా సుధీర్

జనార్ధనరావుకు నివాళి

శ్రీశైలంప్రాజెక్ట్: కార్మిక సంఘం నేత తాల్లూరి జనార్దనరావు 23వ వర్ధంతిని సున్నిపెంటలో మంగళవారం నిర్వహించారు. స్వామిరెడ్డి భవన్‌లో కార్మికులు జనార్దనరావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి జనార్దనరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కె.నాగిరెడ్డి, నాయకులు ఓబులయ్య, బి.లక్ష్మయ్య, పులిరాజు, అన్వర్‌బాషా, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల సందర్శన

ఆత్మకూరు: శ్రీశైలం మహాక్షేత్రానికి కాలినడకన వెళ్తున్న శివభక్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య వైద్యశిబిరాలను జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి ప్రసన్నలక్ష్మి సందర్శించారు. బైర్లూటీ పీహెచ్‌సీ పరిధిలోని బైర్లూటీ, వెంకటాపురం వైద్యశిబిరాన్ని సందర్శించి వైద్యపరీక్షలపై సిబ్బంది చేస్తున్న సేవలను భక్తులను అడిగి వివరాలు సేకరించారు. వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్, ఫాతిమా, యశోద తదితరులు పాల్గొన్నారు.

బాలికలను సంరక్షించుకోవాలి

మిడుతూరు: బాలికలను సంరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని సీడీపీఓ కోటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో బేటీ బచావో.. బేటి పఢావో కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేష్‌కృష్ణ

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మండల ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు వారి గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అనంతరం శాతనకోట సర్పంచ్ జనార్దన్‌గౌడు, బిజినవేముల సర్పంచ్ రవియాదవ్‌లు తమ గ్రామాల్లో కొంత మందికి రేషన్‌బియ్యం అందడంలేదని ప్రతి నెలా ఇదే తరహాలో సమస్య ఉంటుందని డీటీ సోమేశ్వరి దృష్టికి తీసుకువచ్చారు. సమావేశానికి హాజరుకాని మండల అధికారులకు నోటీసులు పంపిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడి రానివ్వొద్దు

వెలుగోడు: వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఎంపీపీ లాలం రమేష్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నీటి సమస్య పై ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పక్కీరయ్య సమాధానం ఇస్తూ.. వేసవి దష్ట్యా వెలుగోడులో సి.పి.నగర్ , గాంధీ నగర్ , ఇందిరానగర్‌లలో నీటి సమస్య ఉందని ట్యాంకుల వద్ద కొత్త బోర్లు వేస్తే నీటి సమస్య తీరుతుందని అన్నారు. మీట్‌లో చర్చించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పరిశీలించారు. మంగళవారం అన్నదాన భవనాన్ని, భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న హాల్స్‌ను సందర్శించారు. వంటకాలను రూచి చూశారు. తాత్కాలిక 30పడకల వైద్యశాలను పరిశీలించారు. అనంతరం దేవస్థాన కమాండ్ కంట్రోల్‌రూంను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పల్స్ పోలియో 100శాతం పూర్తి

పాములపాడు: మండలంలో 100 శాతం పల్స్ పోలియో చుక్కలు పిల్లలకు వేయడం జరిగిందని డాక్టర్ నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో 0-5 సంవత్సరాల్లోపు పిల్లలకు 97.28శాతం చుక్కలు వేయడం జరిగిందన్నారు. 4, 5 తేదీల్లో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు ఇంటింటికీ తిరిగి మిగిలిన చిన్నారులకు కూడా చుక్కలు వేశారని చెప్పారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం అధికారులు, సిబ్బందికి బ్రహ్మోత్సవాల విధులు కేటాయించారు. శ్రీశైలం సర్కిల్ కార్యాలయంలో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు బ్రహ్మోత్సవ విధులకు హాజరైన సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పోలీసు శాఖ తరుపు అడిషనల్ ఎస్పీలు-2, డీఎస్పీలు-9మంది, సీఐలు-23మంది, ఎస్‌ఐలు-82మంది, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్ మొత్తం 1600మందితో పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మార్కెట్ వేలం పాటలు వాయిదా

నందికొట్కూరు: 2024-25 సంవత్సరానికి సంబంధించిన మార్కెట్ వేలం పాటలు వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని జైకిసాన్ పార్కులో నిర్వహించిన వేలం పాటలో ఎవరూ వేలం పాడలేదు. దీంతో వాయిదా వేసినట్లు చెప్పారు.